# కర్నూలు | నంద్యాల వార్త

19 ఫిబ్రవరి 2026 గురువారం పేజీలు 4


## రాయలసీమ పేపర్ మిల్లు లోని ప్రభుత్వ భూమిని పేద ప్రజలకు అందిస్తాం..ఎంపీ బస్తిపాటి

**కర్నూలు ఫిబ్రవరి 18 ప్రభాతవార్త ప్రతినిది :** కర్నూలు రూరల్ మండలం గొందిపర్ల గ్రామంలోని శ్రీ రాయలసీమ పేపర్ మిల్ లో ఉన్న ప్రభుత్వ భూమిని పేద ప్రజలకు అందించేందుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు చర్యలు చేపట్టారు... ఇల్లు లేని పేద ప్రజలకు ఇంటి స్థలాలు కేటాయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు పేపర్ మిల్ లోని ప్రభుత్వ భూమి పై రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్. సిరి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమన్, ఆర్డీవో సందీప్, రూరల్ మండలం ఎంఆర్ఓ రమేష్ బాబు తో కలిసి ఎంపీ నాగరాజు పేపర్ మిల్ లో ని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో రాయలసీమ పేపర్ మిల్ కు అప్పటి ప్రభుత్వం 60 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించందని, ప్రస్తుతం మిల్ మూతపడిన నేపథ్యంలో ప్రభుత్వం కేటాయించిన భూమిని వెనక్కు తీసుకొని పేద ప్రజలకు కేటాయించాలని ఎంపీ అధికారులను కోరారు..అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సొంత ఇళ్లు ఉండేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు... రాయలసీమ పేపర్ మిల్లు లోని ప్రభుత్వ భూమిని పేద ప్రజల ఇళ్లకు అందిస్తామని తెలిపారు...

## అశ్వ వాహనంపై.. శ్రీ స్వామి అమ్మవార్లు..!

### ముగిసిన మహా శివరాత్రి.. బ్రహ్మోత్సవాలు

**శ్రీశైలం ప్రాజెక్ట్ ఫిబ్రవరి 18, ప్రభాతవార్త.** మహాశివరాత్రిని పురస్కరించుకుని ఫిబ్రవరి 8వ తేదీ నుండి నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 18 వ తేదీ బుధవారం నాటితో ముగిశాయి. ఈ ఉత్సవాల భాగంగా ఈరోజు ఉదయం శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలను జరిపించబడ్డాయి. అశ్వ వాహనంపై శ్రీ స్వామి అమ్మవార్లు. ఈ బ్రహ్మోత్సవాల్లో నిర్వహించబడే వాహనసేవలో భాగంగా బుధవారం నాడు సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు

అశ్వవాహనసేవ జరిపించబడింది. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు చేశారు. తరువాత ఆలయ ఉత్సవం నిర్వహించబడుతుంది. పుష్పోత్సవం శయనోత్సవం ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా రాత్రి శ్రీస్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం జరిపారు. ఈపుష్పోత్సవంలో శ్రీ స్వామిఅమ్మవార్లనుపవసుపు చేమంతి, తెలుపు, చేమంతి, నీలం చేమంతి నందివర్ధనం, గరుడవర్ధనం, ఎర్ర గన్నేరు, తెల్లగన్నేరు, మందారం, ఎర్ర ఆస్టర్, నీలం ఆస్టర్, కాగడాలు, మల్లెలు, కనకాంబరాలు, ఎర్రగులాబిలు, పసుపు గులాబీలు, బహువర్ణ గులాబీ, ఊదా గులాబి మొదలైన 21 రకాలకు పైగా పుష్పాలతో

విశేషంగా అర్చించడం జరిగింది. తరువాత శ్రీస్వామిఅమ్మవార్లకు ఏకాంతసేవను నిర్వహించి శయనోత్సవం జరిపించబడింది. ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం ఈవో ఎం శ్రీనివాసరావు దంపతులు అర్చక స్వాములు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నెలవంక.. తొంగి చూసింది..!

- సమత మమత సమ్మిళితమే రంజాన్..
- ఎదనిండా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే మాసం..
- నేటి నుంచి 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు..

**ఆకాశంలో నెలవంక కనిపించింది.. ముస్లీంలకు రంజాన్ మాసం ప్రారంభమయింది.. సమత, మమతల సమ్మిళితాన్ని చాటిచెప్పే అతి పవిత్రమైన పండుగ రంజాన్.. ఈ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించడంతో ముస్లీంలు ఈ నెలను పవిత్రంగా భావిస్తారు.. రంజాన్ ఉపవాస దీక్షలు నేటి నుంచి ప్రారంభం అవుతాయి..ఈ సందర్భంగా జిల్లాలోని పలు మసీదులు ప్రత్యేక నమాజ్‌లకు ముస్తాబయ్యాయి.. ప్రపంచంలోని ముస్లీంలు అతి పవిత్రంగా, అత్యంత శ్రద్ధలతో జరుపుకునే పండుగ రంజాన్ వేడుక.. నెలవంక దర్శనంతో దీక్షలు చేపట్టి తిరిగి 30 రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను విరమిస్తారు..ఈ నెలరోజుల పాటు ఉపవాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు.**

**కోసిగి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** పవిత్ర ఖురాన్ అవతరించిన మాసం కావడంతో ఈ ఏడాదిలో వచ్చే ఒకరాత్రి వెయ్యి నెలల కంటే శ్రేష్టమైనదిగా భావిస్తారు.. రంజాన్ మాసం అంటే ఇది బాహ్య సౌందర్యాలకు తావివ్వక, ఆత్మ సౌందర్యానికి పట్టం కట్టే అరుదైన పండుగ.. ఒక మహత్తరమైన వేడుక.. ఎదనిండా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే సంతోషాలు నిండుగ.. సంబరాల వేదిక.. వ్యక్తిని అతని వ్యక్తిత్వాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దే కఠినతరమైన ఆధ్యాత్మిక మార్గం.. నెలరోజుల పాటు ఉపవాసం ఉన్న వారిలో సప్త వ్యసనాలను తొలగించి ఇతరుల పట్ల దయ, కరుణ, ప్రేమ, వాత్సల్యాలను పెంపొందిస్తాయని నమ్ముతారు.. ఉపవాసదీక్ష మానసిక, శారీరక, ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడుతుంది.. ఒక్కమాటలో చెప్పాలంటే సాధారణ వ్యక్తి జీవితాన్ని సమాజానికి ఉపయోగపడే సద్గుణాలను నింపుకుని సోదర భావాన్ని కలిగిస్తుంది..ఇదే ఇస్లాం మూల సూత్రాల్లో ప్రధానమైన లక్ష్యం.. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల పాటు ముస్లీంలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలను పాటిస్తారు.. అల్లాహ్‌కు దీక్షాపరుడి మధ్య ఉన్న అతి రహస్యమైన దీక్షగా దీనిని పేర్కొంటారు.. నెలరోజుల పాటు ఉపవాసం ఉండేవారు కఠోరమైన దీక్షతో దీక్షలను చేపట్టాలి.. చెడు మాట్లాడటం, చెడు వినడం, ఇతరులను దూషించడం వంటి పనులు చేయకూడదు. దైవ సన్నిధిలోనే నిత్యం గడుపుతూ ఉండాలి.. తెల్లవారు జామున సహారి.. సాయంత్రం ఇఫ్తార్‌తో ఉపవాస దీక్ష ముగుస్తుంది.. ఈ మధ్య కాలంలో ఎటువంటి పదార్థాలను స్వీకరించకూడదు.. పచ్చి మంచినీళ్లు సైతం ముట్టుకోకుండా ఈ పవిత్రమైన, కఠోరమైన దీక్షను పాటించాల్సి ఉంటుంది..

• వివరాలు 2లో

## ఉగాది ఏర్పాట్లపై.. సన్నాహక సమావేశం

**శ్రీశైలం ప్రాజెక్ట్ ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో మార్చి 16వతేదీ నుంచి 20వతేదీ వరకు ఉగాదిమహోత్సవాలు నిర్వహింపబడనున్నాయి. 19వతేదీన ఉగాది పర్వదినం రానున్నది. ఐదురోజులపాటు జరుపబడనున్న ఈ మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై కార్యాలయంలోని సమావేశభవనములో ఈవో ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నాడు సన్నాహకసమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అర్చకస్వాములు, వేదపండితులు, ఆధ్యాపక, (స్థానాచార్యులు) డిప్యూటీ కార్యనిర్వహణాధికారిణి..

• వివరాలు 2లో

## ఉపాధిహామి పరిరక్షణ కోసం..

## వైయస్ షర్మిల యాత్ర..!

**: మోదీ, బాబు కలిసి ఉపాధిని నిర్వీర్యం చేస్తున్నారు**

**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** నంద్యాల జిల్లాలో కొనసాగుతున్న ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా ఏపీసీసీ (ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) అధ్యక్షు రాలు వైయస్ షర్మిల రెడ్డి కానాలపల్లి గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. గ్రామస్థులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఆమె, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు

నాయు డు ప్రభుత్వం కలిసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తున్నాయని ఆరోపించారు. ˇరాష్ట్ర వాటా ఇవ్వలేని వారు 40 శాతం ఎలా ఇస్తారు?" మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర వాటా 10 శాతం కేటాయింపులకుగాను గతేడాది రూ.800 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.450 కోట్లు మాత్రమే విడుదల చేసి మిగతావి పెండింగ్‌లో ఉంచారని షర్మిల విమర్శించారు. ˇ800 కోట్లే ఇవ్వలేని ప్రభుత్వం, ఇప్పుడు 40 శాతం వాటా కింద పడే రూ.5 వేల కోట్లను ఎక్కడి నుంచి తెస్తుంది?" అని ప్రశ్నించారు. ˇ90 శాతం కేంద్ర నిధులు వచ్చినప్పటికీ రాష్ట్ర వాటా ఇవ్వలేకపోయారు. ఇప్పుడు 40 శాతం ఇస్తామని చెబితే ప్రజలు నమ్మాలా? 100 రోజులు పని కల్పించని వారు 125 రోజులు ఇస్తామని చెప్పడం విశ్వసనీయమేనా?" అని నిలదీశారు.ఉపాధి హామీ ఉద్యోగ కార్డుల తొలగింపు - గ్రామాల్లో ఉపాధి సంక్షోభం రాష్ట్రంలో గతంలో 1.10 కోట్ల ఉపాధి హామీ ఉద్యోగ కార్డులు ఉండేవని, దాదాపు రెండున్నర కోట్ల మంది ఉపాధి ద్వారా లబ్ధి పొందారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఉపాధి పనులు గ్రామాల్లో పండుగలా జరిగేవని, పనిస్థలాల్లో అన్ని వసతులు కల్పించేవారని తెలిపారు. అయితే గత ఏడాది కాలంలో 18.5 లక్షల ఉద్యోగ కార్డులు తొలగించారని ఆరోపించారు. ˇఉపాధి హామీ చట్టం సారాన్ని తీసేశారు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ కొత్త గ్రామీణాభివృద్ధి చట్టం పేరుతో మార్పులు తెచ్చారని విమర్శించారు. పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించారని ఆరోపించారు. ˇపథకాన్ని పూర్తిగా రద్దు చేయకుండా సారాన్ని మాత్రం తీసేశారు. గ్రామసభల నిర్ణయాధికారాన్ని తీసేసి కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టారు. ఇది గ్రామీణాభివృద్ధి వినాశనానికి దారి తీస్తుంది" అని అన్నారు. ˇఅప్పుల కుప్పపై కొత్త భారం జగన్, చంద్రబాబు కలిసి రాష్ట్రాన్ని రూ.11 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని షర్మిల ఆరోపించారు. ˇప్రభుత్వం నడవాలంటే ఏటా లక్ష కోట్ల అప్పు తేవాల్సిన పరిస్థితి. ఇలాంటి సమయంలో కొత్త గ్రామీణాభివృద్ధి చట్టం కింద వేల కోట్ల భారం రాష్ట్రం ఎలా భరిస్తుంది?" అని ప్రశ్నించారు. ˇఉపాధి పరిరక్షణ కోసం పోరాటం ˇమోదీ, చంద్రబాబు కలిసి రాష్ట్రంలో ఉపాధిని చంపుతున్నారు. ఉపాధిని ఇద్దరూ ఖూనీ చేస్తున్నారు. కాంగ్రెస్ చేస్తున్న పోరాటం ఉపాధి హామీ పరిరక్షణ కోసం. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని షర్మిల స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం అమలు, నిధుల విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## వేదావతి నది(హగరి) నుంచి అక్రమంగా.. ఇసుక తరలిపు : ఎమ్మెల్యే

- ఇసుక ట్రాక్టర్‌పై అక్రమంగా వసూలు చేస్తున్న రూ.500... చేరేదెవరికి...
- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఆలూరు వైకాపా ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

**హొళగుంద, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;** హొళగుంద మండల పరిధిలోని మార్లమడికి గ్రామ సమీపంలో ఉన్న వేదావతి (హగరి) నది నుంచి అక్రమంగా ఇసుక ట్రాక్టర్‌లు తరలుతున్నాయని, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని మార్లమడికి సమీపంలోని వేదావతి నదిని వైకాపా మండల కన్వీనర్ షఫీవుల్లా ఆధ్వర్యంలో వైకాపా నాయకులతో కలిసి ఆలూరు వైకాపా ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మార్లమడికి గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తీరుపై ఆయన ట్రాక్టర్ డ్రైవర్లు, హమాలీలతో మాట్లాడారు. ఇసుకరీచ్‌లోకి వెళ్లాలంటే రహదారి కూడా లేకుండా ట్రాక్టర్లు, డ్రైవర్లు ఎన్నో అవస్థలు, వ్యయ ప్రయాసాలు పడుతూ ఇసుకను తరలిస్తున్నారన్నారు. నదిలోకి వెళ్లేందుకు రహదారి కూడా సక్రమంగా లేకున్నా, మరోవైపు కొంతమంది ట్రాక్టర్ల డ్రైవర్లు యజమానుల వద్ద ఒక ట్రిప్పు ఇసుక కోసం రూ.500 వసూలు చేస్తున్నారని, ఇదేమిటని అడిగితే ఇదంతే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఇసుక అంటూ ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా ఇసుకరీచ్‌ను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే హొళగుందలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న ఆదోని సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్‌ను కలిసి కూటమి నేతలు చేస్తున్న అక్రమ ఇసుక దందా విషయాన్ని వివరించారు. వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ హొళగుంద తహసీల్దార్ నిజాముద్దీన్, ఎంపీడీఓ విజయలలితతో మార్లమడికి ఇసుక రీచ్‌ను పర్యవేక్షించి, అక్రమంగా ఇసుక తరలివెళ్లకుండా చూడాలని సబ్‌కలెక్టర్ సూచించారు.

అనంతరం ఎమ్మెల్యే విరుపాక్షి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకపై ఏ ఒక్కరు కూడా ఇసుక కోసం రూ.500 చెల్లించరాదని, కేవలం ఇళ్లు, గృహాలు, ప్రభుత్వ భవన నిర్మాణాల కోసం ఉచిత ఇసుకను వినియోగించుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లార్తి ఎస్.కె.గిరి, కో కన్వీనర్ సులువాయి కన్నయ్య, కోగిలతోట శేషప్ప, వైస్ ఎంపీపీ భర్త సింధువాళం హనుమప్ప, వైకాపా నాయకులు గోవిందు, పాల్తూరు గోవిందు, లింగంపల్లి మౌనేష్, లింగంపల్లి శంభు, మార్లమడికి రమేష్, హొళగుంద నాయకులు రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృ-శిశు మరణాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోండి

**– జిల్లా కలెక్టర్ జి రాజకుమారి**

**నంద్యాల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త ప్రతినిధిః** జిల్లాలో మాతృ మరియు శిశు మరణాలను గణనీయంగా తగ్గించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి వైద్యాధికారులకు అదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాతృ-శిశు మరణాల నివారణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇటీవల టంగుటూరు దబ్బు కొత్తపల్లి, యూపిహెచ్‌సి జగజ్జననీ నగర్ యూపిహెచ్‌సి అహోబిలం రోడ్డు (ఆళ్లగడ్డ) ఎన్‌జివో కాలనీ ప్రాథమిక మరియు పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో నమోదు అయిన ఐదు శిశు మరణాలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. కారణాలను విశ్లేషించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖ, స్త్రీ-శిశు సంక్షేమశాఖలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రమాద గర్భిణిలను ముందుగానే గుర్తించి అవసరమైన పరీక్షలు పోషకాహారం వైద్యసేవలు సమయానికి అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదేశించారు. మాతృ-శిశు మరణాలు అత్యంత విషాదకరమైనవే కాకుండా వ్యవస్థలో ఉన్న లోపాలను స్పష్టంగా సూచిస్తున్నాయని ఇకపై నిర్లక్ష్యం ఏస్థాయిలోను సహించేది లేదన్నారు. ప్రతిగర్భిణి ప్రతి శిశువు భద్రత ప్రభుత్వానికి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు గర్భిణిలను

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవం జరిగేలా సమగ్ర పర్యవేక్షణ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, టీనేజీ గర్భదారణలు మాతృ-శిశు మరణాలకు ప్రధాన కారణాలని పేర్కొంటూ వాటిని పూర్తిగా అరికట్టేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పుట్టిన ప్రతి శిశువు ఆరోగ్యంగా ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. సేవలందించడంతో ఏవిధమైన నిర్లక్ష్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈసమావేశంలో అడిషనల్ డిఎంహెచ్ఓ డా.శారదాబాయి, ఎంసిహెచ్ నోడల్ అధికారి డా.ప్రసన్న లక్ష్మీ, ప్రోగ్రామ్ అధికారి డా.ఎస్ఎస్ శ్రీజ, నంద్యాల సర్వజన ఆసుప త్రి గైనకాలజీ విభాగం డా.పి పద్మజ, శిశు విభాగం డా.రవీంద్రనాథ్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ లీలావతి, ప్రాథమిక ఆరోగ్యఆరోగ్యకేంద్రాల వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో.. ఆరోగ్యం.. ఆదాయం..!

- : తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- : రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి
- : శనగ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులకు సూచన

**కర్నూలు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యంతో పాటు రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి రైతులకు సూచించారు. బుధవారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో పంటల పరిశీలనకు వెళ్లిన కలెక్టర్, రైతు ఈశ్వరయ్య సాగు చేస్తున్న శనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అలాగే షకీర్ బాషా, శామీర్ పండిస్తున్న బెండ, మల్లె పంటలను, రవి సాగు చేస్తున్న ఆకుకూరలను, హనీఫ్ పండిస్తున్న బొండు మల్లె పంటలను పరిశీలించి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ శనగ పంటకు ఎకరానికి రూ.7,500 పెట్టుబడి పెట్టగా సుమారు రూ.20,000 వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.30,000 పెట్టుబడి పెట్టగా సుమారు రూ.54,000 వరకు ఆదాయం వచ్చే అవకాశముందని తెలిపారు. జీవామృతం, వేప గింజల కషాయం వంటి ప్రకృతి సిద్ధ పద్ధతులతో పంటలు సాగు చేస్తున్నట్లు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా శనగ, మొక్కజొన్న పంటలను విజయవంతంగా సాగు చేస్తున్న ఈశ్వరయ్యను కలెక్టర్ అభినందించారు. ఇతర

రైతులు కూడా స్ఫూర్తిగా తీసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం వల్ల పండే ఆహారం విషరహితంగా ఉండి ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. ప్రకృతి సిద్ధ పద్ధతులు భూసారాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు మేలుచేస్తాయని పేర్కొన్నారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడకుండా జీవామృతం, ఘనజీవామృతం వంటి ప్రకృతి సిద్ధ కషాయాలను వినియోగించాలని సూచించారు. శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నందున రైతులు వాటిని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వంచే.. పట్టువస్త్రాల సమర్పణ

**రుద్రవరం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** తెలంగాణ ప్రభుత్వంచే శ్రీఅహోబిల లక్ష్మీనరసింహస్వాములకు తెలంగాణ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు. బుధవారం మండల కేంద్రం రుద్రవరంలో కొనసాగుతున్నశ్రీఅహోబిల లక్ష్మీనరసింహస్వామి పార్వేట చివరిరోజు ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అదేశాల మేరకు ఆ రాష్ట్రంలోని అలంపూర్ జోగులాంబ దేవాలయం ఎగ్జిక్యూటివ్ అధికారి దీప్తిరెడ్డి, మహబూబ్‌నగర్ దేవాదాయ కమిషనర్ మధన్ చేతుల మీదుగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం అహోబిలం దేవస్థానం ఈవో రామానుజన్ ఆలయ ప్రధాన అర్చకులు రమేష్, కళ్యాణమయ్యలు పట్టువస్త్రాలు సమర్పించడానికి వచ్చిన తెలంగాణ దేవాదాయశాఖ అధికారులకు ఘనంగా ఆహ్వానం పలికి లక్ష్మీనరసింహస్వామి జ్ఞాపికలను అందజేసి పట్టువస్త్రాలతో సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈసందర్భంగా తెలంగాణ అధికారులు మాట్లాడుతూ మా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవాదాయశాఖ మంత్రి అదేశానుసారం శ్రీఅహోబిల లక్ష్మీనరసింహస్వామి పార్వేట పల్లకీ దర్శించుకొని పట్టువస్త్రాలను సమర్పించినట్లు వారు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా శ్రీఅహోబిల

లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవాలు జరగడం ఒక గొప్ప విశేషంగా చెప్పుకోవచ్చన్నారు. ఆ స్వామివారి కృప ఎల్లవేళల మాపై మా ప్రభుత్వంపై ఉండాలని మనసార కోరుకుంటున్నా మన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ చంద్రశేఖరయ్య, విఆర్వోలు సంజీవరెడ్డి, నాగ నరసింహుడు, ఏఎస్ఐ బాలన్న తదితర సిబ్బంది ఉన్నారు.

## అహోబిలేషుని సన్నిధిలో తెలంగాణ దేవాదాయశాఖ అధికారులు

**ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ దేవాదాయ ధర్మాదాయశాఖ అదేశాల మేరకు బుధవారం మహబూబ్ నగర్ అసిసె ంట్ కమిషనర్, గద్వాల జోగులాంబ దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి,

వేదపండితులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున దిగువ అహోబిలంలోని 46వ పీఠాధిపతి స్వామిజీ వద్ద ఆశీర్వదం తీసుకున్నారు.దిగువ అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు ఆశీర్వాదం తీసుకున్నారు. అహోబిలం దేవస్థానం సిఏవో రామానుజన్ స్వామి, అహోబిల ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలస్వామి, మణియార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపవాస ప్రార్థనలు దేవునికి అత్యంత ప్రీతికరమైనవి

**– రెండు పండగలు ఉపవాస దినాలు... ఒకేరోజు ప్రారంభం**

**ఆదోనిలీగల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;** మానవ జీవితానికి ఉపవాసంతో కూడిన ప్రార్థనలు దేవునికి అత్యంత ప్రీతికరమైనవని, ఆ ప్రార్థనల ద్వారానే దేవుడు అడిగిన ఫలితాలు ఇస్తారని ఆదోని కతోలిక మండిగిరి బాలయేసు చర్చి విచారణ గురువు, రెవరెండ్ ఫాదర్ గోడుగునూరు ప్రవీణ్ అన్నారు. బుధవారం చర్చిలో విభూది బుధవారం ప్రారంభ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఉపవాస దినాలు దేవునికి చాలా ఇష్టమన్నారు. ప్రతి మనిషి మానవ జీవిత మనుగడలో భాగంగా ఎన్నో పొరపాట్లు చేస్తూ ఉంటారని, వాటిని సరిదిద్దుకుని హృదయ పరివర్తన కలిగి దేవుని దగ్గర కావాలని సూచించారు. ఉపవాస ప్రార్థనలతోపాటు ధాన ధర్మాలు, పశ్చాత్తాపం తదితరవి చాలా అవసరమన్నారు. దేవుడు మానవ జీవితాన్ని ఒక ఆశీర్వాదంగా మానవులకు ప్రసాదించారన్న విషయాన్ని గుర్తు చేశారు. హృదయ పరివర్తన మనిషి మనుగడకు కీలకమైనదన్నారు. ఈ లోకం అశాశ్వతమైనదని, మట్టి నుంచి వచ్చిన ఈ శరీరం మట్టిలోనే కలవక తప్పదన్న విషయాన్ని గుర్తు చేశారు. దేవుని యెడల ఆధ్యాత్మిక శక్తి చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కన్యస్త్రీలు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

**– ప్రారంభమైన రంజాన్‌మాస ఉపవాస దినాలు**

గత కాంలో ఎప్పుడు లేనివిధంగా రెండు కీలకమైన పండగలు అనగా ఈస్టర్ పండగ ఉపవాస దినాలు, అదేవిధంగా ముస్లీంలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన రంజాన్ పండగ ఉపవాస దినాలు కూడా ఇదే రోజున ప్రారంభం కావడం చర్చనీయాంశంగా మారింది. 40 రోజులపాటు ముస్లీం సోదరులు ఈ రంజాన్ మాస వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. అదేవిధంగా క్రైస్తవులు కూడా ఈ ఉపవాస దినాలను అత్యంత భక్తిశ్రద్ధలతో కూడా జరుపుకుంటారు.

## ఉగాది ఏర్పాట్లపై.. సన్నాహక సమావేశం

**(మొదటి పేజీ తరువాయి ) :** ఆర్. రమణమ్మ, అన్ని శాఖల అధికారులు, పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. సమావేశ ప్రారంభంలో కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ ఉగాది ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండే కాకుండా మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలి వస్తారని చెప్పారు. ఉగాది ఉత్సవాలు మార్చి 16 తేదీన ప్రారంభ మవుతున్నప్పటికీ వారం రోజులు ముందుగానే భక్తులు క్షేత్రానికి చేరుకునే అవకాశం ఉందని అన్నారు. మార్చి మొదటివారం కంతా కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. శ్రీస్వామిఅమ్మవార్ల కైంకర్యాలు ఉత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లకు జరిగే ఆయా కైంకర్యాలన్నీ ఎలాంటి లోపం లేకుండా పరిపూర్ణంగా జరగాలని ఆదేశించారు. అదేవిధంగా పూజాదికాలు అన్నీ నిర్దేశించబడిన సమాయానికంతా ప్రారంభించాలని అన్నారు. మంచినీటిని అందించడములో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. అదేవిధంగా సాక్షిగణపతి, హఠకేశ్వరం, శిఖరేశ్వరం మరియు కైలాద్వారంతో పాటు క్షేత్రంలో భక్తులు బసచేసే పలు ప్రదేశాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా దర్శనం క్యూలైన్లలో కూడా నిరంతరం మంచినీటి సరఫరా చేయాలన్నారు. **స్వచ్ఛందసేవకుల సహకారం:** భక్తులకు సేవలను అందించేందుకు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన స్వచ్ఛందసేవకుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. **విద్యుద్దీకరణ :** భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీశైలమంతటా పలు ఆరు బయలు ప్రదేశాలలో లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. **వైద్య ఆరోగ్య సేవలు :** లక్షలాదిసంఖ్యలో భక్తులు వస్తున్న కారణంగా అవసరానికి సరిపడ మేరకు దేవస్థానం వైద్యశాలలో అవసరమైన మేరకు ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్రపరిధిలో పలుచోట్ల గల శాశ్వతమరుగుదొడ్లను భక్తులు వినియోగించుకునేందుకు వీలుగా అందుబాటులో ఉంచాలన్నారు. **సూచిక బోర్డులు :** భక్తులకు సమాచారాన్ని తెలియజేసేందుకు అవసరమైన అన్ని చోట్ల కూడా కన్నడభాషలో విస్తృతంగా సూచికబోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. **పుష్పాలంకరణ :** ఉత్సవాలలో ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేయాలని ఉద్యానవిభాగాన్ని ఆదేశించారు. **సాంస్కృతిక కార్యక్రమాలు :** ఉత్సవాలలో భక్తులను అలరించేందుకు కన్నడ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. **సమాచార కేంద్రాల ఏర్పాట్లు :** ఉత్సవాలలో భక్తుల సౌకర్యార్థమై నందిసర్కిల్, కల్యాణకట్ట, పాతాళగంగమెట్లమార్గం, తదితర ప్రాంతాల్లో తాత్కాలిక సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమాచార కేంద్రాలలో కన్నడ ప్రాంతాల స్వచ్ఛందసేవకులను ఏర్పాటు చేసుకుని వారి సహకారంతో భక్తులకు తగు సమాచారాన్ని అందజేయాలన్నారు.

## నెలవంక.. తొంగి చూసింది..!

**(మొదటి పేజీ తరువాయి ) :** ప్రతి రోజు ఐదు పూటలు నమాజ్ చేయడంతో పాటు రాత్రి వేళల్లో తరావీహ్ నమాజ్‌ను తప్పనిసరిగా పాటించాలి.. ఈ నెలలో చేసే నమాజ్‌లకు పవిత్ర కార్యాలకు ఎంతో పుణ్య ఫలం లభిస్తుందని పవిత్ర ఖురాన్ పేర్కొంటోంది.. ప్రతి ముస్లీం విధిగా రంజాన్ ఉపవాస దీక్షలు పాటించాలని తెలుపుతోంది.. తప్పనిసరి అయితే తప్ప దీక్షను విరమించకూడదని కూడా ఖురాన్ తెలుపుతోంది..ఉపవాసం ఉండగల శక్తి ఉన్న ప్రతి ఒక్కరు దీక్షలు పాటించాలని పవిత్ర గ్రంథం తెలుపుతోంది.. రంజాన్ నెలలో ఉపవాసం ఉండే వారికి సమాజ సేవ పట్ల అంకితభావం, నిరుపేదల పట్ల సేవ చేయాలనే సంకల్పం, సన్మార్గంలో నడిచే ఒక అద్భుత అవకాశం ఈ ఉపవాసాల దీక్షల వల్ల కలుగుతుందని చెబుతారు.. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జిల్లాలోని పలు మసీదులు అందంగా ముస్తాబు చేస్తున్నారు..

## జంపాపురంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ..

**కోసిగి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** కోసిగి మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి, ధరణీధర్ రెడ్డిల సహకారంతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి వైకాపా జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి భూమి పూజను చేపట్టారు..బుధవారం ఎంఎల్ఎ ఆదేశాల మేరకు మురళీమోహన్‌రెడ్డి హాజరై గ్రామ సర్పంచ్ అహరోన్, కాంట్రాక్టర్ చూడి బసిరెడ్డిల సమాక్షంలో ఈ భూమిపూజను చేపట్టి పనులు ప్రారంభించారు.. జంపాపురం గ్రామంలోని తలారి బసవరాజు ఇంటి నుండి ఎల్ఐసి బసప్ప ఇంటి వరకు సుమారు 150 మీటర్లు పని ప్రారంభించారు.. ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధుల రూ. 10 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.. అలాగే గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉండే 20 మంది ఎస్సీ కుటుంబాలకు కుళాయిలను కూడా ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు..ఈలాంటి అభివృద్ధి పనులు చేయడంతో ఆ కాలనీ వాసులు హర్షం వెలుబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ గంగమ్మ, చూడి బసిరెడ్డి, ఇంద్రారెడ్డి, జేకే.ఈరన్న, రామకృష్ణరెడ్డి, దేవేంద్రరెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు..

## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

**ఆదోనిలీగల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;** జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఎఘన బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదోని మండలం చాగి గ్రామానికి చెందిన ఎం.గుండప్ప కుమారుడు మాల మల్లప్ప ఆదోని-ఇన్వీ రైల్వే స్టేషన్‌ల మధ్య కి.మీ. నంబర్ 497/32 వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కడుపులో గడ్డలు ఏర్పడి ఇబ్బందులకు గురయ్యాడు. ఆసుపత్రిలో చూపించినా గడ్డలు తగ్గకపోవడంతో మానసికంగా కుంగి ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో తేలిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## బసవన్న గోశాల నుండి సాగు రైతులకు ఎద్దుల పంపిణీ..

**బనగానపల్లె, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** యాగంటి క్షేత్రం సమీపంలో బుర్రా వెంకటేశ్వర్లు స్థాపించి నడుపుచున్న బసవన్న గోశాలలో పోసిస్తున్న ఎద్దులను సాగుకు పనికి వచ్చే సమయానికి వాటిని అడిగిన పేద రైతులకు పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారము కూడ కొంతమంది రైతులకు ఎద్దులను పంపిణీ చేశారు. ప్యాపిలి మండలం నేరేడుజెల్ల, ఉప్పలపాడు, మీరాపురం గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ యోగ్యమైన ఎద్దులను పంపిణీ చేశారు ఈ పంపిణీ కార్యక్రమంలో కాటసాని తిరుపాల్ రెడ్డి యాగంటి పల్లె బండి బ్రహ్మానందరెడ్డి, యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి బుర్ర వెంకటేశ్వర్లు గడ్డం వెంకటేశ్వర రెడ్డి బండి పుల్లారెడ్డి యాగంటి పల్లె పుల్లారెడ్డి అంబటి శ్రీనివాసరెడ్డి పైపుల బెడదల రామచంద్రారెడ్డి పాతపాడు సంగు రామసుబ్బారెడ్డి లు పాల్గొన్నారు. తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ బుర్రా వెంకటేశ్వర్లు తాను ఏర్పాటు చేసిన బసవన్న గోశాలలో పెద్ద సంఖ్యలో గోవులను పోషిస్తూ వాటి నుండి వచ్చే పాలను యాగంటి స్వామి వారి అభిషేకాలకు, చుట్టుపక్కల గ్రామాలలోని చంటి పిల్లలకు అందజేస్తున్నారని, అదే సమయంలో మగ దూడలను పోషించి వాటిని వ్యవసాయానికి పనికి వచ్చే ఎద్దులుగా పోషించి సాగుకు అవసరమైన రైతులకు వాటిని పంపిణీ చేస్తుండడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. గతంలో కూడా సంక్రాంతి మహాశివరాత్రి పర్వదినాల సందర్భంగా గోశాలలో ఉన్నటువంటి ఎద్దులను సాగు కోసం అడిగిన రైతులకు ఇవ్వడం జరిగిందని ఇంత మంచి కార్యక్రమం చేస్తున్న ఆయనకు భగవంతుడు ఆశీస్సులు అందజేయాలని తలంచారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు ఇటువంటి మంచి కార్యక్రమం చేసిన బుర్ర వెంకటేశ్వర్లను అభినందించారు పాల్గొన్నారు.

## రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీని నమోదు చేసుకోవాలి

**– ఏఓ ఉషారాణి**

**దేవనకొండ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;** రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీని నమోదు చేసుకోవాలని ఏఓ ఉషారాణి సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో ఏఓ సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ఫార్మర్ ఐడీని అర్హులైన ప్రతి రైతు నుంచి నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ ద్వారా కానీ, గ్రామ, వార్డు సచివాలయం లేదా మీసేవా కేంద్రాల్లో ఈకేవైసీ ద్వారా ఉచితంగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. మండలంలో 2804 మంది రైతులు గుర్తింపు సంఖ్య కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. ఈ ఫార్మర్ ఐడీ నమోదైతే పీఎం కిసాన్, రైతు భరోసా జమ అవుతాయని, లేనిపక్షంలో జమ కావని చెప్పారు.

## సామాజిక తనిఖీపై బహిరంగ సభ

**హాలహర్వి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;** హాలహర్వి మండలంలోని ఆయా ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీలో నిర్వహించిన తనిఖీల్లో రూ.76542 అవకతవకలు జరిగాయని ఉపాధి హామీ ఇన్‌చార్జి పీడీ మధులత తెలిపారు. ఈ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాది పనులు కల్పించి వలసలను అరికట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ఉపాధి హామీ పని దినాలు 125 రోజులకు పెంచిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, ఏపీఓ చక్రవర్తి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## 20న జె.హొసళ్లిలో సామూహిక వివాహాలు

**హాలహర్వి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;** మండల పరిధిలోని జె.హొసళ్లి గ్రామంలో ఈనెల 20న శ్రీ పట్టదస్వామి మఠం ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి శంభులింగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా శివరాత్రి మాసంలో పట్టదస్వామి మఠం ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివాహాలకు రూ.20 వేలు ఫీజు చెల్లిస్తే వధూవరులకు రెండు మంగళ సూత్రాలు, వస్త్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే బంధుమిత్రులకు భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. వధువుకు 18 సంవత్సరాలు, వరుడికి 22 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వామి కోరారు. అదే రోజున సాయంత్రం పట్టదస్వామి రథోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## వెండిపట్టీలను చోరీ చేసిన నిందితులు అరెస్టు

**నంద్యాల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తప్రతినిది :**

నంద్యాల పట్టణంలోని బంగారు షాపు నందు వెండిపట్టీలను చోరీ చేసిన ఇద్దరు మహిళలను ఒకటవ పట్టణ సిఐ సుదాకరరెడ్డి అరెస్టు చేశారు. అయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 12దవ తేది మద్యహ్నాము 12.30నిమిషాల సమయంలో బంగారు అంగళ్ల వీదిలో ఉన్న హెచ్‌యంజ్యూవెల్లరన్‌స షాపులోకి ఇద్దరు మహిళలు వెండిపట్టీలు కొనుగోలు చేయడానాకి వచ్చిటన్లు నటించి ఫాపులో సుమారు 17తులాలు గల వెండి పట్టీలను దొంగిలించారని చెప్పారు. బాదితుని పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాస్తులో బాగంగా సిసి పుటేజ్ అదారముగా ఈ రోజు ఉదయం 11.30నిమిషాల సమయంలోమదనపల్లె జిల్లా వాయిల్‌పాడు మండలం బోయపల్లి గ్రామానికి చెందినవేములు జ్యోతి, వేముల నరసమ్మలను నంద్యాల టౌన్ అర్టిసి బస్ స్టాప్ వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుండి 17 తులాల వెండి పట్టీలను స్వాదీనము చేసుకున్నట్లు చెప్పారు.

## పాఠశాలకు ప్రింటర్ విరాళం

**మంత్రాలయం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త ;** మండల పరిధిలోని సుంకేశ్వరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు ఓ ప్రింటర్‌ను విరాళంగా ఇచ్చినట్లు పాఠశాల హెచ్ఎం ఖాదర్‌బాషా బుధవారం విలేకరులకు తెలిపారు. వివరాల మేరకు.... పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రామక్రిష్ణయ్య, ఆశ, బాలమద్దయ్య, షబ్బీర్‌బాషా, వీరశంకర్, సుజాతలు సుమారు రూ.15 వేలు విలువ గల ప్రింటర్‌ను పాఠశాలకు అందజేశారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల కష్టాలను దృష్టిలో ఉంచుని తమ సొంత నిధులతో ఈ ప్రింటర్‌ను అందించినట్లు హెచ్ఎం తెలియజేశారు. ఉపాధ్యాయులు తమవంతు సేవను పాఠశాలకు అందించడం గర్వ కారణమన్నారు. విద్యార్థులు కూడా భవిష్యత్‌లో సేవా దృక్పథం కలిగి ఉండాలని కోరారు. విద్యాకమిటీ చైర్మన్ అయ్యప్ప, ఉపాధ్యాయులు మద్దిలేటి, రాజేశ్వర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, కవిత పాల్గొన్నారు.

## 21 మండల సర్వసభ్య సమావేశం

**– ఎంపీడీఓ జ్యోతి**

**దేవనకొండ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;** ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్, అగ్రికల్చర్, హైసింగ్, ప్రైమరీ ఎడ్యుకేషన్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, పశుపోషణ తదితర శాఖల అధికారులు తప్పనిసరిగా ప్రగతి నివేదికలతో పాల్గొనాలన్నారు. గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఇస్కాన్ అహోబిలంలో ఘనంగా పార్వేట ఉత్సవాలు

**–చంద్రకేశవ దాస్**

**రుద్రవరం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** శ్రీఅహోబిల లక్ష్మీనరసింహాస్వామి పార్వేట ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. బుధవారం రాత్రి హరినగరం గ్రామ సమీపంలోని హరే రామ, హరే కృష్ణ గోశాల వేదికగా శ్రీఅహోబిల లక్ష్మీనరసింహావారి పార్వేట మహోత్సవాలు ఇస్కాన్ అహోబిలం ఆలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా అహోబిల ఇస్కాన్ ప్రాజెక్టు ఇంచార్జీ చంద్రకేశవ దాసు మాట్లాడుతూ శ్రీఅహోబిల లక్ష్మీనరసింహాస్వామి పార్వేట ఉత్సవాల్లో చివరి మజిలి అయిన ఇసా గ్రన్ టెంపుల్ వారి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక ఆహ్వానం పలికి ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించి అనంతరం ఇస్కాన్ బృందం వారిచే సంకీర్తనలు మంగళహారతి, తులసి హారతి, గౌర హారతి, నరసింహా కీర్తనలతో స్వామివారిని ఆలరించామని వారు తెలిపారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన భక్తాందులందరికి భోజన ప్రసాద వితరణ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వామివారి పార్వేట పల్లకీ ఇస్కాన్‌వారి ఆద్వర్యంలో ఉత్సవాలను నిర్వహించడం ఎంతో మహాభాగ్యమని స్వామివారి కృప ఎల్లవేళల మాపై ఉండాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమానికి తిలకించడానికి పలు గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు.

## పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేయించిన ఎక్సైజ్‌శాఖ అధికారులు

**– అక్రమ మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతాం – కర్నూలు ఏఈఎస్ డి.రామకృష్ణరెడ్డి**

**ఆదోనిటౌన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;** ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 82 కర్ణాటక మద్యం కేసుల్లో 2170 లీటర్లు, 54 డీపీఎల్ (ఆంధ్ర) కేసుల్లో 97 లీటర్ల మద్యం, 34 నాటుసారానాయి ధ్వంసం చేసినట్లు కర్నూలు ఏఈఎస్ డి.రామకృష్ణరెడ్డి తెలిపారు. బుధవారం పట్టుబడిన మద్యాన్ని వాహనాలతో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి విలువ సుమారు రూ.12,70,200గా ఉందన్నారు.

**– 28 వాహనాలకు వేలం పాటలు**

స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన 28 వాహనాలకు వేలం పాటలు నిర్వహించగా రూ.2,11,000 గానూ రూ.3,33,000 వాహనాలు అమ్ముడు పోయినట్లు కర్నూలు ఏఈఎస్ డి.రామకృష్ణరెడ్డి తెలిపారు. వీటికి జీఎస్టీతో కలిపి (రూ.59940) మొత్తం రూ.392940 ప్రభుత్వ ఖజానాకు జమ చేసిట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ తెలిపారు.

## పంచాయితీలకు త్రిచక్ర వాహనాల పంపిణి

**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** మండల పరిధిలోని పంచాయితీలకు బుధవారం స్వచ్ఛభారత్ మిషన్ కింద కొలిమిగుండ్ల మండలానికి పారిశుద్ధ్య పనుల నిర్వహణకు 29 త్రిచక్ర వాహనాలు మరియు 174 డస్ట్‌బిన్‌లు మండల పరిషత్ కార్యాలయానికి ప్రభుత్వం పంపించారని వీటిని ఏ గ్రామానికి మంజూరు చేశారో అయా గ్రామ పంచాయితీలకు పంపిణి చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో చంద్రమౌలీశ్వర్‌గౌడ్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీక్షేత్రానికి చేరుకున్న లక్ష్మీనరసింహాస్వామి

**రు ద్రవరం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** మండల కేంద్రంలోని ఆటవీశాఖ కార్యాలయంలో బుధవారం అహోబిల లక్ష్మీనరసింహాస్వామి పార్వేట ఉత్సవమూర్తుల పల్లకీ చేరింది. ఇందులో భాగంగా జిల్లా అటవీశాఖాధికారి అనురాగ్ మీనా సబ్ డిఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, రేంజ్ అధికారి ముర్తుజా వలి, ఇతర అటవీసిబ్బంది ఫారెస్టు కార్యాలయంలో అనవాయితీ ప్రకారం తెలుపుపై కొలువైన లక్ష్మీనరసింహాస్వామి ఉత్సవమూర్తులకు ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఫారెస్టు కార్యాలయంఓ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవానికి హాజరైన భక్తులకు భోజన వసతి కల్పించారు. ఉత్సవాల్లో పలువురు గ్రామపెద్దలు, పారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

## గోకుల షెడ్డును ప్రారంభించిన ఎంపీడివో దస్తగిరి బాబు

**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో పల్లె పండుగ 2.0 కింద పాడి యజమాని మ్రరిబోయిన నరసింహులు రూ.2 లక్షల అంచనా మొత్తంతో మంజూరు కాబడి పూర్తిచేసిన గోకుల షెడ్డును బుధవారం ఎంపీడివో దస్తగిరి బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసంవత్సరానికి గాను మొత్తం 5 గోకులషెడ్డు మంజూరు అయ్యాయని అందులో ప్రధానంగా బుధవారం కోటపాడు గ్రామంలో గోకులషెడ్డును ప్రారంభించామని ఎంపీడివో తెలిపారు. ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సి రాజబాబు, టెక్నికల్ సహాయకులు బండారు రమేష్, ఓబులేసు, చెన్నయ్య, గ్రామ టీడీపీ నాయకులు ఎంవి శివరామిరెడ్డి, ఎం శివారెడ్డి, కల్లూరి నారాయణ, నాగచౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలి

**కొత్తపల్లె, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** గ్రామంలో అక్రమంగా కడుతున్న ఇంతిని అధికారులు నిలిపివేయాలని నందికుంట గ్రామస్థులు శివమ్మ, రజియా, మూర్తుజాబి, లక్ష్మీదేవిలు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మౌలాలి అనే వ్యక్తి తనకున్న సెంటున్నర స్థలంతో పాటు ఇతరుల ఇంటిస్థలాలను, రోడ్డును అక్రమించుకొని అక్రమంగా ఇంటిని నిర్మిస్తున్నారని రోడ్డువైపు నిర్మాణం చేయరాదని ఎందరు చెప్పినా వినడం లేదని ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదుచేశామని అధికారులు, గ్రామ పెద్దలు చెప్పినా వినకుండా ఇంటినిర్మాణం సాగిస్తున్నారన్నారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమకు కళ్లాలకు వెళ్లెందుకు దారి చూపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు న్యాయం చేయకపోతే సమస్యను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకుపోతామన్నారు.

## ఘనంగా మిషన్ మిల్లెట్స్ కార్యక్రమం

**కర్నూలు విద్య, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** కెవిఆర్ ప్రభుత్వ కళాశాలలో డిపార్టుమెంట్ అఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో స్పాన్సర్ చేయబడిన మిషన్ మిలెట్స్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మరియు వర్కుషాపు కన్వీనర్ డా.జి వి రంగారెడ్డి సహకన్వీనర్ డా.టి లావణ్య కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈకార్యక్రమాన్ని వృక్షశాస్త్ర, జంతుశాస్త్రం బయోటెక్నాలజీ మరియు బయో కెమిస్ట్రి విభాగాలు సంయుక్తంగా నిర్వహించాయి. బయోటెక్నాలజీ విభాగ ఇంచార్జీ డా.ఆర్ రామిరెడ్డి, బయో కెమిస్ట్రి విభాగ ఇంచార్జీ డా.ప్రసాద్ గుప్తా లైఫ్ సైన్సెస్ విభాగాల అధ్యాపకులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాలింతలకు పోషకాహారం సకాలంలో అందించాలి..

**: బాల్య వివాహాలను చేసుకోరాదంటూ అవగాహన..**

# ధ్వజా అవరోహణతో ముగిసిన యాగంటి బ్రహ్మోత్సవాలు

**: వైభవంగా నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం : ముగిసిన యాగంటి శివదీక్షలుదీక్ష విరమించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి**

**బనగానపల్లె, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మండలంలోని ప్రముఖ సేవలు యాగంటి శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో గత నెల 14 నుంచి నుండి బుధవారం వరకుఅత్యంత వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ధ్వజాఅవ రోహణతో ముగిశాయి. వరుసగా ఐదు రోజులపాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ ఈవో ,అసిస్టెంట్ కమిషనర్ డి పాండు రంగారెడ్డి ఆలయ చైర్మన్ బండి చంద్రమోళి రెడ్డిలు ఆలయ సిబ్బంది ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం యాగంటి శివదీక్ష విరమణ అనంతరం ఆలయ సిబ్బంది, అర్చకస్వాముల ఆధ్వర్యంలో నాగవల్లి, వసంతో త్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభ వంగా జరిగాయి. యాగంటిలో భక్తి శ్రద్ధలతో శివదీక్ష విరమ దీక్ష విరమించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మహాశివరాత్రి ఉత్సవ ఉత్సవాల భాగంగా ఐదవ రోజున బుధవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి శివదీక్ష విరమణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా ముగిసింది. మండల, అర్ధమండల శివదీక్ష చేపట్టిన శివ స్వాములు తమ సమీపంలోని ఆలయాల్లో ఇరుముడి ధరించి పాదయాత్రగా బయలుదేరి యాగంటి ఉమామహేశ్వర స్వామి సన్నిధిలో ఇరుముడి దించి, మాలవిసర్జన చేసి శివదీక్ష విరమించారు. ఈ దీక్ష విరమణలో నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే, శివస్వామి దీక్షకు అంకురార్పణ చేసిన గురుస్వామి కాటసాని రాంభూపాల్ రెడ్డి పాతపాడు వద్ద దేవస్థానం ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో ఇరుముడి ధరించి అక్కడి నుంచి పాదయాత్రగా యాగంటి క్షేత్రం చేరుకొని స్వామి సన్నిధిలో ఇరుముడిని దించి మాలధారణ మాల విసర్జన చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆయన సతీమణి శ్రీమతి కాటసాని ఉమా మహేశ్వరమ్మ వారి తనయుడు వైఎస్సార్సిపి యువనేత కాటసాని శివ నరసింహ రెడ్డి దంపతులు హోమమంలో పాల్గొన్నారు. అనంతరం దీక్ష విరమణ చేసేందుకు విచ్చేసిన శివ స్వాములకు, వారి కుటుంబ సభ్యులకు, భక్తులకు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ ఉమామహేశ్వర నిత్య అన్నదాన సత్రంలో అన్నదాన వితరణ కావించారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నిత్యాన్నదానసత్రం ప్రధాన కార్యదర్శి మల్కిరెడ్డి దస్తగిరి రెడ్డి బివి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న ప్రిన్సిపాల్..!

**: ఎం భారతి పై చర్యలు తీసుకోవాలి**

**డోన్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** డోన్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం భారతి పై చర్యలు తీసుకోవాలని డోన్ యువకులు బుధవారం కడపలో ఉన్న ఆర్జెడి కార్యాలయంలో డాక్టర్.కె.జ్ఞానేశ్వర్ రావు సమక్షంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎస్ విజయ్ కుమార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీని, కాలేజీ గ్రౌండ్ ని అభివృద్ధి చేసి, యువతను క్రీడా రంగం వైపు పరుగులేత్తించాలనే ఉన్నత ఆశయంతో, దాతల సహకారంతో కళాశాలను అభివృద్ధి చేస్తున్న డోన్ కి చెందిన యువకులపై సదరు కళాశాల ప్రిన్సిపాల్ కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారు. సామాజిక స్పృహతో ముందుకు వచ్చిన యువతను ప్రోత్సహించాల్సింది పోయి, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించిన కొంతమంది సామాజిక స్పృహ కలిగిన యువకులు, పూర్వ విద్యార్థుల సంఘం మరియు దాతల సహకారంతో కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. సొంత నిధులతో పాటు దాతల నుంచి సేకరించిన మొత్తంతో ఆట స్థలం అభివృద్ధి పనులు, క్రీడాకారులు, ఆటలను తిలకించడానికి వచ్చిన వారు కూర్చోవడానికి శాశ్వత మెట్ల ఏర్పాట్లు, సిమెంట్ బల్లలు, తాగునీటి సౌకర్యం వంటి పనులు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని డోన్ డిగ్రీ కాలేజీ అనతి కాలంలోనే మంచి అభివృద్ధి జరుగుతుంది అన్న విషయాన్ని జీర్ణించుకోలేక అసూయతో అడ్డుతగులుతున్నారు డోన్ ప్రిన్సిపాల్ డాక్టర్ యం.భారతి మరియు వారి సిబ్బంది రాంమూర్తి, వెంకటరామడు కళాశాల రూపురేఖలు మారుతున్న తీరును చూసి అభినందించాల్సింది పోయి, సదరు ప్రిన్సిపాల్ తన ఆధిపత్యం ఎక్కడ తగ్గుతుందోనన్న అభద్రతా భావంతో యువకులను మానసికంగా వేధిస్తున్నారు. పనులు జరుగుతున్న సమయంలో అనవసరపు నిబంధనలు పెట్టడం, పోలీసులతో భయపెట్టడం, కేసులు పెట్టి ఇబ్బందులు కలిగించడం, అనుమతులు లేవంటూ అడ్డంకులు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సద్వినియోగం కాకపోయినా, స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకొస్తే అడ్డుకోవడంపై విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు ప్రిన్సిపాల్ తీరుపై మండిపడుతున్నారు.ప్రిన్సిపాల్ తీరుతో విసిగిపోయిన యువకులు, ఆమెపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కాలేజీ విద్యా శాఖ రాయలసీమ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వారికి ఫిర్యాదు చేశారు. విద్యాసంస్థల అభివృద్ధికి సహకరించే వారిని వేధిస్తే, భవిష్యత్తులో ఎవరూ ముందుకు రారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి కళాశాల అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూడాలని కోరుతున్నారు. చెందిన యువకులు రహిమాన్, హుసేన్, మరికొందరు ప్రిన్సిపాల్ దుందురుసు ప్రవర్తనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ వైఖరి విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాతల సహకారంతో యువకులు చేస్తున్న అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారని రెహమాన్, హుసేన్ లు తెలిపారు.

## జేఈఈలో మురిసిన ఆణిముత్యం

**చాగలమర్రి. ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** జేఈఈ మెయిన్స్‌లో మండలంలోని మూడురాళ్ళ పల్లె గ్రామానికి చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచారు. గ్రామానికి చెందిన తిప్పసాని నరసింహారెడ్డి (అప్పి) లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు తిప్పసాని వినయ్‌కుమార్‌రెడ్డి 99.79 శాతం సాదించారు. విజయవాడలోని ష్రస్ ్ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ప్రతిభ చూపిన వినయ్‌కుమార్‌రెడ్డిని కుటుంబీకులు స్నేహితులు, శ్రేయోభిలాషులు మండల గ్రామ ప్రజలు అభినందించారు.

## వైభవంగా ఆలయాల వార్షికోత్సవం

**చాగలమర్రి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** మండలంలోని మూడురాళ్ళపల్లె గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి సాయినాథ ఆలయాల ద్వితీయ ప్రతిష్ట వార్షికోత్సవ ఉత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు పులి చిన్న ఓబుల్‌రెడ్డి పద్మావతమ్మల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు అనిల్‌కుమార్ నవగ్రహ గణపతిహోమాలు, అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేదపండితులు పులి చిన్న ఓబుల్‌రెడ్డి, పద్మావతమ్మ, ఓబుల్‌రెడ్డి విజయమ్మ, మహేశ్వర్‌రెడ్డి అరుణ, బాలకృష్ణ, సావిత్రి దంపతులచే శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణం వేదమంత్రోచ్చరణల మధ్య కమనీయంగా నిర్వహించారు. ఈకళ్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తిలకించి వారి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడికి వచ్చిన భక్తులందరికి ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో పులి పెద్ద ఓబుల్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆలయ నిర్వాహణ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జిలతో విఆర్వోల నిరసన

**పాములపాడు, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః** ప్రభుత్వం పనిభారాన్ని తగ్గించాలని విఆర్వోలపై ఒత్తిడి తగ్గించాలని నల్లబ్యాడ్జిలతో పాములపాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట విఆర్వోలు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. విఆర్వోల సంఘం అధ్యక్షులు ఉశేన్ మాట్లాడుతూ విఆర్వోలపై ఒత్తిడి పెరుగుతుందని కొంతమంది విఆర్వోలు ఒత్తిడికి లోనయి ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని ప్రభుత్వం ఒత్తిడి తగ్గించాలని డిప్యూటి తహశీల్దార్ పఠాన్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో విఆర్వోలు శివన్న, మురుజా వలి, మద్దిలేటి, పురంధరుడు, శ్రీనివాసులు, సామేలు, మాబాష పాల్గొన్నారు.

## ముగిసిన దృష్టిపోర్టల్ శిక్షణ కార్యక్రమం

**నంద్యాల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త ప్రతినిధిః** నంద్యాల ఉప విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న మూడురోజుల దృష్టి పోర్టల్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమానికి సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానంద హాజరయ్యారు. ఈశిక్షణా కార్యక్రమానికి రాష్ట్ర రిసోర్స్ పర్సనల్ జస్నా, బ్రిజిత్ మరియ అంటోలతో మాట్లాడుతూ శిక్షణ ఉద్దేశమేమిటో అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈమూడు రోజుల్లో ఐడిఎస్ఎస్ స్కూల్ అసిస్టెంట్‌లు, ఐఈఆర్‌పిలు హెచ్ఐఎంఆర్ ఉపాధ్యాయులు శిక్షణా అంశాలను క్షుణ్ణంగా నేర్చుకొని మీ మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసర పిల్లల విద్యను వారికి అర్థమయ్యేవిధంగా బోధన చేయాలని ఈఅదునాత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఉపాధ్యాయులందరికి ట్యాబ్‌లను అందజేయడం జరిగిందని దాని ద్వారానే విద్యార్థులకు సులబమైన పద్ధతితో అర్థమయ్యేవిధంగా బోధన సమగ్రాలను అందులో కేంద్రికరించి దృష్టిపోర్టల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్పెషల్ ఉపాధ్యాయులు చక్కగా శిక్షణ పొంది జిల్లాను ప్రథమస్థానంలో వచ్చేలా కృషిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఐఈ జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీవో రాంమోహన్, సహాయ సమన్వయకర్త శ్రీనివాసులు, ఐఈఆర్‌టిలు పాల్గొన్నారు.

## విద్యార్థులు స్ఫూర్తిదాయకులుగా తయారు కావాలి

**– మాధవరం హెచ్ఎం భోజరాజు**



**మంత్రాలయం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త ;** ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సమాజంలోని అందరికీ స్ఫూర్తిదాయకులుగా తయారు కావాలని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం భోజరాజు అన్నారు. బుధవారం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి దాయకంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇటీవల గ్రూప్-2 ఉద్యోగం సాధించిన మాధవరం వీఆర్వో రంగస్వామిని ముఖ్య అతిథిగా పిలిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వో రంగస్వామి ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి గ్రూప్-2 ఉద్యోగం సాధించడం చాలా గర్వకారణమన్నారు. ఆయన తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నేడు ఈ స్థానానికి చేరుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వీఆర్వో మాట్లాడుతూ పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా ఉన్న కుమాదావతి భర్త అయిన శ్రీనివాసులు ద్వారానే నాకు ఈ స్థానం దక్కిందన్నారు. శ్రీనివాసులు 1998 నుంచి 2000 సంవత్సరం వరకు మాకు గురువుగా ఉన్నారన్నారు. ఆయన ప్రోత్సాహంతోనే నవోదయ పరీక్షలు రాసి 6వ తరగతి నుంచి ఇంటర్ బనవాసి గురుకుల హాస్టల్‌లో చదివినట్లు తెలిపారు. విద్యార్థులు ముఖ్యంగా సంస్కారం నేర్చుకోవాలన్నారు. సంస్కారం నేర్చుకుంటే విద్య తప్పకుండా వస్తుందన్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఉన్నత రీతిలో పాస్ కావాలని ఆకాంక్షించారు. అనంతరం వీఆర్వోను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, సతీష్‌కుమార్, వెంకటేశ్వర్లు, జిక్రియ, నీలకంఠస్వామి, తారాదేవి పాల్గొన్నారు.

## వి.ఆర్.ఓ.లపై పని ఒత్తిడి తగ్గించాలి

**నందికొట్కూరు,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** గ్రామ రెవిన్యూ అధికారుల(వీఆర్వో)పై పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్తానిక రెవిన్యూ కార్యాలయం వద్ద ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నర్సరాజు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా ప్రధాన కార్యదర్శి నరసరాజు మాట్లాడుతు ముందుగా పని ఒత్తిడితో మృతి చెందిన వీఆర్వోలకు సంతాపం తెలుపు వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. వీఆర్వోలు ఎవరు అంధోళన చెంద వద్దని ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో రెవిన్యూ జి.ధ.భ్యూ ఎస్ అధికారులతో సమన్వయం లేక పోవడం వలన గ్రౌండ్ లెవెల్ పని చేస్తున్న గ్రామ రెవిన్యూ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, డిపార్ట్మెంట్ జాబ్ చార్జ్ ప్రకారమా లేదా ఏ జాబ్ చార్జ్ ప్రకారం నిధులు నిర్వహించాలో కూడా స్పష్టత లేకుండా ఒకే సారి అన్ని విధులు చేయాలని, ఒక పక్క రెవిన్యూ మరో పక్క, జి.ధ.భ్యూఎస్ అధికారులు ఎవరికి వారు వారు చెప్పిన పని చేయాలని ఒత్తిడి చేయడంతో చాల మంది వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆంధోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి, గ్రామ రెవిన్యూ అధికారుల సమస్యలు పరిష్కారించాలని తెలియ జేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని, దాని కారణంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జనవరి 12వ తేదీ నుండి వర్క్ టూ రూల్ అమలు చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేసి రాష్ట్ర వ్యాప్తంగా వర్ 7 టూ రూల్ అమలు చేస్తూ ఉంటే కావాలని కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడం బలవంతంగా సమయపాలన పాటించకుండా పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ.మహమ్మద్ ఉశ్శేన్, సీనియర్ అసిస్టెంట్ శ్యామల, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, తలారుల సంఘం నాయకులు మహేష్, వీఆర్వోలు వెంటకేష్, మనోహార్, బుద్దకవి, స్వామన్న, మనోహార్‌గౌడ్, సుజిత, పవిత్ర, శ్రీనువాసులు, ఆనంద్, రంగన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినవేముల పూర్వపు విద్యార్థుల ఔదార్యం

**నందికొట్కూరు,ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా ఏదో విధంగా సహాయపడేందుకు పూర్వపు విద్యార్థులు బీరువా, పోర్టబుల్ స్పీకర్లు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. బుధవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాల పూర్వపు విద్యార్థులైన మురళీధర్, రమణయ్య మెరుగైన వసతులు కలిపించేందుకు బీరువా, పోర్టబుల్ స్పీకర్లను విరాళంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగప్రసాద్, ఉపాధ్యాయుడు పెరుమళ్ళ రాజశేఖర్ లకు అందజేశారు. ఈ సంధర్భంగా పూర్వపు విద్యార్థులు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కేవలం ప్రభుత్వ భాధ్యత మాత్రమే కాకుండా మన వంతు భాధ్యతగా కృషి చేద్దామన్నారు. గతంలో పాఠశాలకు దాదాపు రూ.50 వేలు విలువైన సామగ్రిని అందజేశారని, ప్రస్తుతం కూడా ఇచ్చారని హెచ్ఎం తెలిపారు. అనంతరం హెచ్.ఎం. ఉపాధ్యాయులు దాతలను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.సుధాకర్, ఉపాధ్యాయులు శ్రీనువాసులు, పద్మావతి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

## రైతు విశిష్ట నెంబరు ఉంటేనే ఏ పి.ఎం. కిసాన్

**పత్తికొండ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** మండలంలో రైతు విశిష్ట నంబరు రిజిస్ట్రేషన్ కొరకు 2143 మంది రైతుల యొక్క జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించడం జరిగిందని మండల ఏవో వెంకటరాముడు తెలిపారు. కావున పైన తెలిపిన రైతులు మూడో విడతగా పిఎం కి సన్నిధిలో జమ చేయునాటికి విశిష్టత నెంబర్ ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీనికికి మీ గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో సంద్రించి నెంబరు కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. లేని పక్షంలో సంక్షేమ పథకాలు అందవని ఏవో తెలిపారు.

## ఘనంగా ఆంగ్ల భాషా పండుగ వేడుకలు

**నందికొట్కూరు,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భాషా పండుగ వేడుకలలో భాగంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ప్రధానోపాధ్యాయుడు పెర్సీ ఇమ్మాన్యూయేల్, ఆంగ్ల ఉపాధ్యాయుడు నాగన్న, యస్.జి.టి. ఉపాధ్యాయురాలు డి. హాసినాబి మాట్లాడుతు ఆంగ్ల భాషా అన్ని భాషలకు రాణి వంటిదని, విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని వారు పలు సలహాలు, సూచనలు చేసి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మోడల్స్, చార్ట్ తయారు చేసి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఆల్గొన్నారు.

## ఛలో విజయవాడ మహాధర్నాకు దళిత నాయకులు

**పత్తికొండ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ నాయకుడు టి.ఎం.రమేష్ హాత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు డిమాండ్ కై నిందుతులను ఎట్టి పరిస్థితుల్లో బెయిల్ ఇవ్వకూడదని, వెంటనే చార్జ్‌షీఈట్ దాఖలు చేయాలని, కేసును ఫాస్ట్ ట్రాకక్ కోర్టుకి బదిలి చేయాలని, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ను సెక్షన్ 14 ప్రకారం ఎక్స్క్లూజ్ స్పెషల్ కోర్టులో విచారణ జరగాలని కోరుతు చేపట్టిన ఛలో విజయవాడ మహాధర్నాకు దళిత నాయకులు వెళ్ళారు. భాధిత కుటుంబానికి ఒక కోటి రూపాయలు నష్టపరిహారం, పూర్తి భద్రత మరియు సాక్షులకు భద్రత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ దళిత నాయకులు గోపాలం, ఉచ్చారప్ప, సాల రంగడుచ, రామ్‌కొండ వెంకటేష్, పులికొండ, డీలర్ నరసింహుడు, ప్రసాద్, రామాంజనేయులు, ఏపి ఎమ్మార్పీయస్ అధ్యక్షుడు బుంగ సంజయ్, ఉసిరిపాటి బ్రహ్మయ్య, దాసరి సువర్ణరాజు, పాల్గొన్నారు.

## చిన్నారులు, మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

**తుగ్గలి,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** చిన్నారులు, మహిళలపై నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున హెచ్చరించారు. మంగళవారం జొనన్నగిరి పోలీసు స్టేషన్ పరిధిలోని జొన్నగిరి, చెరువుతాండ, ఎర్రగుడి, చెన్నంపల్లి, కడమకుంట్ల, శభోష్‌పురం గ్రామాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్సై మాట్లాడుతు చిన్నారులు, మహిళలపై గ్రామాలలో ఎవరైన నేరాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించభోమని అలాంటి ఘటనలు గ్రామాలలో చోటు చేసుకున్నట్లు అయితే వెంటనే పోలీసులకు సమాచారం అంధించాలని అపరిచితులతో సంభంధాలు, సోషల్ మీడియా వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. చిన్నారుల, మహిళల రక్షణ పట్ల అందరు భాధ్యతాయుతంగా ఉండాలని ఎస్సై సూచించారు.

## బిణిగేరి లో అంతరాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు

**ఆలూరు,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** మండల పరిధిలోని బిణిగేరి గ్రామంలోని సమీప కొండల్లో వెలసిన శ్రీ పంచలింగేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం ఆలయ నిర్వాహకులు శ్రీనివాసనాయన, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంత:రాష్ట్రస్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలను ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతు రైతుల సంభరాల కోసం ఇలాంటి పోటీలు అలాగే రైతులను ప్రోత్సాహించేందుకు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలకు 11 ఝుతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఎద్దుల యజమానులు గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలన్నారు, పంచ,లింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ పోటీలు గత అయిదు ఏళ్ళుగా ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. మొదటి బహుమతి కర్నూలు జిల్లా కోడుమూరు మండలం కొత్తపల్లి రైతు దుబ్బన్న జత 4786 అడుగులు లాగి రూ.50 వేలను దాత ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, 2వ బహుమతి అనంతపురం జిల్లా గుంతకల్ మండలం నాగసముద్రం గ్రామ రైతు అనసూయమ్మ ఎద్దులు 4532 అడుగులు లాగి రూ.40 వేలు దాత ఆలూరు ఎమ్మెల్యే బూషినే విరుపాక్షి తనయుడు వైసిపి యూత్ విభాగం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ అందజేశారు. 3వ బహుమతి అనంతపురం జిల్లా గుంతకల్లు మండలానికి చెందిన నరసింహారెడ్డి, గుర్రంబాడు గ్రామ రైతు ఎద్దులు 4303 అడుగులు లాగి రూ.30 వేలు దాత జడ్పిటీసి దొరబాబు, 4వ బహుమతి కర్నూలు జిల్లా కోడుమూరు మండలం కొత్తపల్లి గ్రామం రైతు చిన్నరంగడు, కంబాలపాడు ఎద్దుల జత 4229 రూ.20 వేలు దాత ఎంపిపి సుంకర ఉమాదేవి, రామాంజనేయులు, 5వ బహుమతి కర్నూలు జిల్లా కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామ రైతు ఎస్,ఎస్.వి ట్రేడర్స్ షేక్ మైమున్నా,ముత్యాల్ఎద్దు జత4161 అడుగులు లాగిరూ.10 వేలు దాత శంకరబండ సర్పంచ్ విజయలక్ష్మి, పురుషోత్తంరెడ్డిలు బహుమతులు అందజేశారు. మిగిలిన ఎద్దు జతలకు కన్సోలేషన్ బహుమతి కింద రూ,5 వేలు ఆలయ కమిటీ ద్వారా అందజేశారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ వెంకటేష్, ప్రముఖ పారిశ్రామిక వేత్త విట్టా రమేష్‌కుమార్, వై.ప్రతాఆప్, వైకాపా కన్వీనర్ బసవరాజు, మాజీ వైకకాపా కన్వీనర్లు రామాంజనేయులు, కేశవరెడ్డి, నాయకులు భీమన్న, వెంకటేష్, రాజన్న, సోమన్న, చిన్నారెడ్డి, నల్లారెడ్డి, ఆలూరు మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకటేష్, టిడిపి మండల కన్వీనర్ గోవిందు, టిడిపి ప్రధాన కార్యదర్శి శేషాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలి

Sri Chaitanya School

## బంగారు కుటుంబాలు - మార్గదర్శుల మ్యాపింగ్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలి

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి**

**నంద్యాల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త ప్రతినిధిః**

జిల్లాలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా అమలు చేస్తున్న పి-4 (ప్రభుత్వ-ప్రైవేట్-ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి విడియోకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో పి-4 కార్యక్రమం పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ కుటుంబం పేదరికంతో బాధపడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పి-4 కార్యక్రమం ప్రారంభించిందని తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం చేసి వారు అందిస్తున్న సహాయ వివరాలను పి-4 పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదుచేయాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో పేదరికంతో బాధపడుతున్న 50,038 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. వీరిలో 40,837 బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని సహాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఇంకా 9,201 బంగారు కుటుంబాలకు మార్గదర్శుల మ్యాపింగ్ పూర్తికాలేదని మిగిలిన కుటుంబాలను స్వర్ణగ్రామం పరిధిలో అర్హులైన మార్గదర్శులతో అనుసంధానం చేసి ఈనెలాఖరు నాటికి పూర్తిస్థాయి మ్యాపింగ్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మొత్తం ఎన్ని బంగారు కుటుంబాలకు ఎన్ని మార్గదర్శులను నియమించారో అందులో ఎంతమందిని లైసన్ (సమన్వయం) చేశారో పూర్తి వివరాలు సమగ్రంగా నమోదు చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. డేటా నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించరాదని పారదర్శకతతో పనిచేయాలని హెచ్చరించారు. ఈసమావేశంలో సిపివో ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

## జనవాసాల్లో పందుల పెంపకం నిషేధం

**- యుఎల్‌బి మానిటరింగ్ కమిటీలో కమిషనర్ పి విశ్వనాథ్**

**కర్నూలు మున్సిపల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్తః**

నగర పరిధిలో జనవాసాల్లో పందుల పెంపకానికి ఏమాత్రం అనుమతి లేదని ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా పందులను తప్పనిసరిగా శివారు ప్రాంతాలకు తరలించాల్సి ందేనని నగర పాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్ స్పష్టం చేశారు. పందుల పెంపకానికి ప్రత్యామ్నాయంగా శివారుప్రాంతాల్లో స్థలాలు కేటాయించే చర్యలు చేపడుతన్నట్లు తెలిపారు. వెంకటరమణ కాలనీలోని నగర పాలక కార్యాలయంలో యుఎల్‌బి స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల మార్గదర్శకాలు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జనవాసాల్లో పందుల పెంపకానికి అవకాశం లేదని తెలిపారు. పందుల పెంపకానికి బస్తాపాడు గ్రామంలో నాలుగు ఎకరాల భూమి కేటాయించే అంశాన్ని ప్రతిపాదించగా పెంపకదారులు మరో రెండు ప్రాంతాల్లోస్థలాలు ఇవ్వాలని కోరిన విషయాన్ని పరిశీలించి సాధ్యసాధ్యాలను నివేదికగా సమర్పించాలని రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ డి రవికుమార్, టూటౌన్ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ నాగరాజురావు, పశుసంవర్ధకశాఖ ఏడీ బి మల్లన్న, డిప్యూటి డైరెక్టర్ జి మాధవ్, డిప్యూటి తహశీల్దార్ ఆర్ విష్ణుప్రసాద్, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.నాగప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ స్థాయి వైద్య సదస్సులో కర్నూలు విద్యార్థి ప్రతిభ..!

**కర్నూలు హాస్పిటల్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త**

తమిళనాడు రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన భారతదేశ స్థాయి వైద్య సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన ఎంబిబిఎస్ తుదివత్సర విద్యార్థి ఏ. కార్తీక్ జాతీయ స్థాయిలో తొలి బహుమతి సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. గైనకాలజీ విభాగానికి సంబంధించిన అత్యంత అరుదైన మరియు క్లిష్టమైన గర్భధారణ కేసుపై కార్తీక్ చేసిన ప్రజెంటేషన్‌కు ఈ గుర్తింపు లభించింది. పది సంవత్సరాల తరువాత ఆంధ్రప్రదేశ్‌కు ఈ స్థాయి ఘనత లభించడం విశేషం. ఈ విజయాన్ని పురస్కరించుకుని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే. చిట్టి నరసమ్మ గైనకాలజీ విభాగ వైద్యులతో కలిసి విద్యార్థి కార్తీక్‌ను అభినందించారు. ఈ ప్రజెంటేషన్‌కు గైనకాలజీ విభాగ అధ్యాపకులు పూర్తి మార్గదర్శకత్వం వహించగా, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రతిష్టను దేశవ్యాప్తంగా చాటింది.

## నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం

**- ముఖ్యఅతిథిగా హాజరయిన టీడీపీ యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్**

**నంద్యాల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త ప్రతినిధిః**

పట్టణంలోని ప్రముఖ అధ్యాత్మిక కేంద్రమైన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ అదేశాల మేరకు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈప్రక్రియ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ హాజరయ్యారు. కమిటీ సభ్యులుగా సభ్యులుగా శ్రీకాళికాంబ చంద్రశేఖర్‌దేవస్థానం చైర్మన్‌గా బింగుమల్ల సుబ్బలక్ష్మయ్య, సభ్యులు వసుంధరదేవి, లక్ష్మణ్‌సింగ్, రాజ్‌పురోహిత్ బాబు సింగ్, పురోహితులు సుబ్రమణ్యశాస్త్రి, లక్ష్మీబాయి, వరలక్ష్మీ, విజయ్‌భాస్కర్, భారతి, సుబ్రమణ్యంలు ప్రమాణస్వీకారం చేశారు. ఈకార్యక్రమంతటిని దేవస్థానం ఈవో లక్ష్మీనారాయణ స్వయంగా పర్యవేక్షించారు. ఈసందర్భంగా చైర్మన్ సుబ్బలక్ష్మయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు, యువ నాయకులు ఫయాజ్, ఫిరోజ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని కాళికాంబ చంద్రశేఖర దేవస్థానం అభివృద్ధికి నూతన పాలక మండలి అంకితభావంతోపనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ మార్గదర్శకత్వంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ సౌకరాయలు మెరుగుపరచాలని సూచించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్‌లాల్, ప్రధమనంది దేవస్థానం చైర్మన్ చలం బాబు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బింగుమల్ల శ్యాంసుందర్ గుప్త, డైరెక్టర్ ఉప్పరి సురేష్, ప్రింట్ మీడియా అధ్యక్షులు మధు, జిల్లా అర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ విజయశేఖర్ ఆశోక్, వినయ్, నెరవాటి రవి, మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, మండి మర్చేంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలూరు కృషా ్ణంజనేయులు, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాకా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిన ఘోర ప్రమాదం.. 30మంది విద్యార్థులు సురక్షితం

**కోవెలకుంట్ల, ఫిబ్రవరి 18,ప్రభాతవార్త**

కోవెలకుంట్ల పట్టణంలోని ఎదరుగా వస్తున్న మోటారుబైకును తప్పించబోయిన విద్యుత్ స్థంబాన్ని స్కూలు బస్సు డీకొట్టడము జరిగింది. అదృష్టవశాత్తు బస్సులో ఉన్న 30మంది విద్యార్థులకు ఘోర ప్రమాదము తప్పింది,. వివరాలోకి వెళ్లితే కోవెలకుంట్ల పట్టన శివారుల్లో ఉన్న జ్యోతి స్కూలు బస్సు ఇందిరమ్మ కాలనీలో పాఠశా లకు విద్యార్థులను తీసుకుని వెళ్లుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న మోటారు బైకుని తప్పించబోయిన విద్యుత్ స్థంబాన్ని డీకొట్టడము జరిగింది, ఈప్రమాదములో విద్యుత్ పోల్ విరిగి పడింది.కొందరికిస్వల్ప గాయలు అయ్యాయి.అదృష్ట వశాత్తు బస్సులో ఉన్న పిల్లలందరు సురక్షితముగా బయట పడ్డారు.

## ఇంటి దగ్గరే సీఎం రిలీఫ్ ఫండ్

## చెక్కులు అందజేత..!

**పెద్దకడబూరు ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :**

మండల పరిధిలో చిన్నకడబూరు గ్రామానికి చెందిన కంపాటి పెద్ద హనుమంతు కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద 3,2714 రూపాయలు చెక్కును బుధవారం టిడిపి నేత రమాకాంత్ రెడ్డి బాధితుల ఇంటి దగ్గరకు వెళ్లి బాధితులకు అందచేశారు సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఎంత పెద్ద వ్యాధులకు అయినా ఉచితంగా కార్పోటు స్థాయిలో వైద్యం చేయించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో మల్లికార్జున, మీసేవ ఆంజనేయ,లీ.బి.నరసన్న,గొళ్ళ నల్లారెడ్డి,కల్లు లక్ష్మన్న,కోడిగుడ్ల లక్ష్మన్న,సుక్కు నరసన్న కంపాటి రాముడు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మున్సిపాలిటీ పీఠంపై.. కూటమి వైసిపి కన్ను..!

**: సమీపిస్తున్న మున్సిపల్ ఎన్నికలు**
**: ఒంటరిగా బరిలోకి వైసిపి..!**
**: కూటమిలో ఎవరికి వారే యమునాతీరు**
**: నేటికి కలువని జనజేన,బిజేపి,టిడిపి**

**నంద్యాల, పిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిది :**

రాష్ట్ర వ్యాప్తంగామున్సిపల్ ఎన్నికల సమయం దగ్గర పడుతోంది. మార్చిన 9వ తేదినమున్సిపల్ ఎన్నికల నగరా మ్రోగనుందని అత్యంత విశ్వనీయ సమాచారము దీనితో వీటిలో తలపడటానికి కూటమి వైసిపి పార్టిల నాయకులు వారి వారి అదినాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారము. అందులో బాగంగా నంద్యాల మున్సుపల్ పీఠము నాల్గువ సారిగా కూడా మాదే అనే రీతిలో వైసిపి పావులు కదుపుతుంటే కూటిమిలో మాత్రం ఎవరికి వారే యమునాతీరం అనే రీతిలో నేటికి ఒకరినొకరు చుట్టుపుచూపుకైన పలుకరింపులు లేనట్లు సమాచారము.అయితే బిజేపి పార్టి మాత్రము పార్టి రాష్ట్ర అద్యక్షుని దేశాలతో జిల్లా పార్టి అద్యక్షులు అబిరుచి మదు మున్సుపల్ పీఠముపై కన్నువేసినట్లు సమాచారము అ కోవలోనే పార్టి యుహ రచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కూటిమి దర్మము ఇక్కడ ఏ పార్టి పాటించడము లేదని అందరికి తెలిసిన నగ్న సత్యము. ముఖ్యంగా జనసేన పార్టిని మాత్రము ఇటు తెలుగు దేశం, అటు బిజేపి దూరంగా ఉంచినట్లు సమాచారము.గతంలో అయితే నంద్యాల జిల్లా బిజేపి కొంత నిశబ్దంగా ఉన్నా అబిరుచి మదు జిల్లా అద్యక్షునికిగా బాద్యతలు చేపట్టినప్పటి నుండి చాలా దూకుడుగా వ్యవహరిస్తు ప్రజల్లో చొచ్చుకుని వెళ్లుతోంది,ముఖ్యంగా మున్సిపల్ పీఠముపై అపార్టి అదినాయకత్వము కూడా కన్ను వేసినట్లు సమాచారము. అయితే ఇక్కడ జనసేన కాస్తా సబ్దతగా ఉండగా ఇటీవల జనసేనలోకి భవాసి వాసు రంగ ప్రవేషము చేయడముతో అ పార్టి కూడా బలాన్ని పుంజుకుంది. అయితే కూటమి దర్మము మాత్రము ఇక్కడ మచ్చుకైనా కనిపించడడము లేదు. ఇక్కడే వైసిపి నంద్యాల మున్సుపాల్టిపై మరో మారు కన్ను పడింది. కూటమిలోని కుమ్ములాటలే మాకు ప్రదాన అస్రాలు అంటు వైసిపి సింగిల్‌గా మున్సుపల్ ఎన్నికలోపాల్గొనన్నట్లు సమాచారము.గత ఎన్నికల సమయంలో వైసిపి అదికారములో ఉండి నంద్యాల మున్సుపార్టిలో 37 సీట్లు సాదించింది, తెలుగు దేశం 4 స్వతంత్రము ఒకటితో సరిపెట్టుకున్నారుఅయితే గతం కంటే ఇప్పుడు ఖర్చు తడిచి మోపేడు అవుతుందని అంటున్నారు.ఒక్కొక్క వార్డులో 50లక్షలనుండి రూ 60లక్షలు అపై కోటి వరకు చేరుకోవచ్చని అంచానాలు వేస్తున్నారు

. గతంలో అంటే ఇక్కడ వార్డులకు దాదాపు అదినాయకుడు మొత్తం ఖర్చు భరించారు. ఇపుడు పార్టి అదికారంలో లేదు అంతా భరిస్తారా; అనే అనుమానాలు కూడా లేక పోలేదు. మేము ముగ్గురము ఉన్నాము తలా ఒక చెయ్యి వేస్తే విజయం సాదిస్తామని మేక పోతు గాంభీర్యము చేస్తున్నారు. టిడిపి కాని అచరణలో మాత్రము ఎవరికి వారు యమునా తీరే అనే రీతిలో ఉన్నారు.అయితే వైసిలో చైర్మన్ పదవికి ఒక్కరే పోటీ కాని కూటమిలో తెలుగు దేశం తరుపున 5మంది బిజేపిలో ఒక్కరు.జనసేన పార్టిలో ముగ్గురు పోటీలో ఉన్నట్లు సమాచారము. సింగిల్‌సింహమా,లేక కూటమిలో ద్వయమా చూద్దాం ఏమి జరుగుతోందోమరి?

## నంద్యాలలో సి అండ్ డి ప్లాంట్ నిర్మాణం వేగవంతం చేయాలి

**– జిల్లా కలెక్టర్ జి రాజకుమారి**

**నంద్యాల, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త ప్రతినిధిః**

నంద్యాల పట్టణంలో నిర్మాణ అండ్ ధ్వంస వ్యర్థాల (సి అండ్ డి వేస్ట్) నిర్మాణ పనులను 2026 జూన్ 5వ తేది నాటికి తప్పనిసరిగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో నిర్మాణ అండ్ ధ్వంస వ్యర్థాల సమర్థ నిర్వహణ కోసం ప్రతిపాదించిన సి అండ్ డి ప్లాంట్ స్థాపన ప్రారంభం మరియు ప్లాంటేషన్ కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో పర్యావరణ ఇంచార్జీ పివి కిశోర్‌రెడ్డి, నంద్యాల ఆర్డీవో సి విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ బి శేషన్న, ఏపీఎల్ఎల్‌సి జోనల్ మేనేజర్ వై మధుసూధన్‌రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో సి అండ్ డి ప్లాంట్ నిర్మాణ పనులను 2026 జూన్ 5 నాటికి తప్పనిసరిగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పరా వ్యవరణ పరిరక్షనకు అనుగుణంగా పట్టణ అభివృద్ధిని సమన్వయం చేస్తు ఈప్లాంట్‌ను సమయానికి పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సి అండ్ డి వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ద్వారా పట్టణంలో స్వచ్ఛత పర్యావరణ సమతుల్యత మెరుగుపుడుతుందని తెలిపారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తు ఎలాంటి అలస్యం లేకుండా వేగవంతంగా అమలుచేయాలని అదేశించారు. ప్లాంట్‌కు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్)ను సిద ్ధం చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను కలెక్టర్ అదేశించారు. ప్రాజెక్టులో అవసరమైన సాంకేతిక అంశాలు, వ్యయ అంచనాలు, పర్యావరణ అనుమతులు తదితర అంశాలు స్పష్టంగా ప్రతిబింబిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రభుత్వ భూములను నిషిద్ధ జాబితాలో పెట్టాల్సిందే.

**ఆదోని ఫిబ్రవరి 18 ప్రభాతవార్త.**

గత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను ఫ్రీ హోల్ చేశారని ఆ ప్రభుత్వ భూములను నిషిద్ధ జాబితాలో చేర్చాలని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయకృష్ణ ,బీజేపీ ఆదోని నార్త్ మండల అధ్యక్షులు మహదేవ్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామకృష్ణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ శివారులోని పర్వతపురం గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 314 ప్రభుత్వ రికార్డు ఆర్ఎస్ సార్ ప్రకారం రస్తా పోరంబోకుగా నమోదయి ఉంది. అయితే గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో ఈ సర్వే నంబర్లోని కొంత భాగాన్ని ఫ్రీ హోల్డ్ చేసి వైసిపి నాయకులైన రామకృష్ణ రెడ్డి వాళ్ల బంధువుల పేర్ల మీద అప్పటి ఆర్ ఐ జయరాం రెడ్డి సహకారంతో రికార్డులను సృష్టించుకున్నారని ఆరోపించారు. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇలా ఫ్రీ హోల్డ్ చేసిన భూములను కూడా హోల్డ్ లో ఉంచాల్సిందే అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. అయినప్పటికీ కొంతమంది అధికారుల సహకారంతో ఆ స్థలంలో ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఉన్నప్పటికీ వెంచర్ వేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వైసిపి నాయకులు ప్రభుత్వం మారినప్పటికీ కూడా వారి ఆగడాలు ఎతేచగా కొనసాగిస్తుంటే అడ్డుకట్ట వెయ్యాల్సిన రెవిన్యూ, పోలీస్ అధికారులు చోద్యం చూస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనాప్పటికీ ప్రభుత్వ భూములను భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు కాపాడు తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సురేష్ ,నాయకులు మధుసూదన్ శర్మ, మునెప్ప, వీరేష్, శివరాజ్,తాయన్న, నాగార్జున, చంద్ర,కిరణ్ ,ఈశ్వర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## మహిళది హత్యా..? ఆత్మహత్యా..!?

- **బాగా కొట్టి ఉరేసినట్లు సమాచారం...**
- **ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు అనుమానాలు**
- **మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు**
- **బళ్లారిలో పోస్టుమార్టం**

**మంత్రాలయం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త;**

మంత్రాలయం రామచంద్ర నగర్‌కు చెందిన చాకలి సంధ్య అనే మహిళ ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సంధ్య భర్త చాకలి సురేంద్రకు భార్యపై అనుమానం అధికంగా ఉన్నట్లు తెలిసింది. అదేవిధంగా భార్యను అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా భార్య, భర్త అనుమానంతో గొడవ పడ్డారు. ఇదే సమయంలో భార్యను సురేంద్ర విచక్షణారహితంగా కొట్టడంతో భార్య మృతి చెందింది. ప్రాణం పోయిన విషయం తెలుసుకున్న భర్త బాడీని ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు నాటకం ఆడాడు. తన భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు అందరినీ నమ్మించాడు. భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలు చనిపోయిన అనంతరం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరించకుండా మృతురాలి పుట్టినిల్లు అయిన కర్ణాటకలోని బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి కేసుల్లో మృతదేహాన్ని పోలీసులు ఎమ్మిగనూరుకు గానీ, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించాలి. అయితే ఇతర రాష్ట్రమైన బళ్లారికి తరలించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక మహిళను వేధించి, హత్యకు పాల్పడిన భర్తపై పోలీసులు హత్య కేసుగా నమోదు చేస్తారో లేక ఒత్తిళ్లకు తలొగ్గి వేధింపుల కేసుతోనే సరిపెడతారా... మండల మెజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ రమాదేవి రెండు రోజులుగా బళ్లారి ఆసుపత్రిలోనే ఉంటూ పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఏదేమైనా హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన అధికారులపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరడానికి హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులను ప్రభాతవార్త సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## టిడిపి నాయకులను పరామర్శించిన నరవ

**పెద్దకడబూరు ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :**

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామానికి చెందిన టిడిపి ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు బొగ్గుల గుడిసె ఉరుకుందప్పను అలాగే పెద్దకడబూరు సొసైటీ డైరెక్టర్ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంజి నరసన్న తండ్రి చిన్నకడబూరు గ్రామను చెందిన ఎంజీ రామాంజనేయులు ను టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్లి బుధవారం పరామర్శించారు అనారోగ్యానికి గల కారణాలను స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్యం చేయించుకోవాలన్నారు ఈ సందర్భంగా రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ నాకు అత్యంత ఇష్టమైన తన మిత్రులు గుడిసె ఉరుకుందప్ప ఎంజి రామాంజనేయులు అనారోగ్యం నుండి త్వరగా కోలుకోవాలన్నారు గతంలో పార్టీ కార్యక్రమంలో తనతో పాటు ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారు అని వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మీసేవ ఆంజనేయులు మల్లికార్జున నాగరాజు ఆశన్న నల్లారెడ్డి కల్లు లక్ష్మన్న రాముడు నరసన్న తదితరులు పాల్గొన్నారు

## హత్యకేసులో ఇద్దరు అరెస్టు

**- అవమానాన్ని భరించలేక పగ పెంచుకొని ఈ ఘాతుకానికి పాల్పడ్డ ముద్దాయిలు..**

**వెల్దుర్తి,ఫిబ్రవరి18,ప్రభాతవార్త :**

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదార్‌పురం కోళ్లఫారం వద్ద ఈనెల12న డోన్ పట్టణానికి చెందిన సురేష్(25) అనే యువకుడు అనుమానస్పదస్థితిలో మృతి చెందినట్లుగా గురువారం వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.అయితే వెల్దుర్తి సర్కిల్ సిఐ యుగంధర్,వెల్దుర్తి ఎస్సై నరేష్ ఈ కేసును క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేపట్టారు.అయితే సురేష్ మృతి అనుమానస్పదం కాదని హత్య జరిగినట్లుగా ఆధారాలను బట్టి ధృవీకరించుకొని హత్య కేసుగా నమోదు చేశారు.ఈ కేసులో సురేష్ మిత్రులు అల్లబకాష్ మొదటి ముద్దాయి,అమ్రేష్ నాయక్ రెండో ముద్దాయిగా గుర్తించి వారిని బుధవారం అరెస్టు చేసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ యుగంధర్ మాట్లాడుతూ డోన్ పట్టణం సుందర్‌సింగ్‌కాలనీకి చెందిన సురేష్ అనే యువకుని మిత్రులు అల్లబకాష్,అమ్రేష్‌నాయక్‌లు తమకు జరిగిన అవమానాన్ని మనస్సులో ఉంచుకొని అతన్ని ఎలాగైనా చంపాలని పథకం పన్నారు.పగ పెంచుకున్నారు.పోలీసుల వివరాల మేరకు అల్లబకాష్ సోదరుడు నూర్‌బాష,పట్టాశేఖర్‌లు ఇద్దరు స్నేహితులు తాగిన మైకంలో వారు డోన్ పట్టణంలోనే గొడవపడి పెద్దల సమక్షంలో రాజీ చేసుకున్నారు.ఒకరి కాళ్లు మరొకరు పట్టుకున్నారు.అయితే ఆ సమయంలో సురేష్ నవ్వాడు.అదేవిధంగా అమ్రేష్ నాయక్ ఇంటికి వెళ్లినప్పుడు అతని భార్యతో సురేష్ అసహ్యంగా ప్రవర్తించడం తట్టుకోలేక అమ్రేష్‌నాయక్,తన అన్నకు జరిగిన అవమానాన్ని అల్లబకాష్ మనస్సులో పెట్టుకొని అతనిపై కక్ష్య తీర్చుకోవాలని ఈనెల 11న బుధవారం సురేష్‌ను మదార్‌పురం వద్ద షేక్షావలి నిర్వహిస్తున్న కోళ్లఫారంకు మిత్రులు ఇద్దరు రప్పించారు.అదేరోజు రాత్రి ముగ్గురు స్నేహితులతో కలిసి మద్యం సేవించారు.మద్యం మత్తులో సురేష్‌ను కట్టెలు,పైపులు,కొడవలి,బండరాయితో బయటకు కనపడకుండా కొట్టి చంపారు.ఏమి తెలియనట్లుగా గురువారం ఉదయం సురేష్ ఎంత లేపిన లేవడం లేదని కట్టుకథ అల్లి సురేష్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.సురేష్ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానస్పద కేసు నమోదు చేసిన పోలీసులు సిసి పుటేజ్,పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హత్య చేయబడ్డాడని గుర్తించి తమదైన శైలిలో విచారించి హత్య కేసు ముద్దాయిలైన మిత్రులు ఇద్దరు అల్లబకాష్,అమ్రేష్‌నాయక్‌లను అరెస్టు చేశారు.వీరిని డోన్ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సిఐ తెలిపారు.

## ఇన్సూరెన్స్ భీమ కుటుంబాలకే పెద్ద భరోసా భీమా..!

**ఆత్మకూరు ఫిబ్రవరి 18ప్రభాతవార్త :**

పేదరికంలో నలుగుతూ ఏదైనా ప్రమాదవశాత్తు పత్తు జరిగే ప్రమాదాలకు బీమా సౌకర్యం కుటుంబానికే భరోసా కల్పించే విధంగా ఉంటుందని ఖుషి బీమా సౌకర్యం నిర్వాహకురాలు షేక్. రుక్సానా అన్నారు బుధవారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గోపిశెట్టి వసుంధర చేతుల మీదుగా ఇదే కళాశాలలో విద్యను పూర్తి చేసుకొని ప్రస్తుతం మార్కెట్ రంగంలో ముందుకు తీసుకెళ్తూ ఎన్